వ్యతిరేకుల తరహా వెదిరె రాతలు

విద్యుత్తు ఖర్చుపై ఆయన వ్యాఖ్యలే నిదర్శనం

- బహుళప్రయోజనాలకే నదీమార్గం ద్వారా ఎత్తిపోతలు
- 'ప్రాణహిత- చేవెళ్ల'లోనూ అంతే కరెంటు వినియోగం
- తెలంగాణ రాష్ట్ర నీటివనరుల అభివృద్ధిశాఖ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్

హైదరాబాద్, మే3 (నమస్తే తెలంగాణ): మే 2న అచ్చయిన వ్యాసంతో వెదిరె శ్రీరాం కాళేశ్వరం విచారణ పూర్తవుతుందని భావించా. కానీ, మే 3న ఐదో భాగం కూడా రాసి ముగించారు. సంతోషం. అందులో కూడా వెదిరె వారికి కొన్ని అంశాలపై వివరణ ఇవ్వాల్సిన అవసరముందని భావించి ఈ వ్యాసం రాస్తున్నా. కాళేశ్వరంలో వినియోగమయ్యే విద్యుత్‌పై చాలా మందికి ఉన్నట్టే వెదిరెకు కూడా అనుమానాలున్నాయని ఆయన రాతలే చెబుతున్నయ్. ఈ అంశంలో ప్రాజెక్టు వ్యతిరేకులు చేసిన ప్రచార పొరవడిలో వెదిరె కొట్టుకుపోయారని స్పష్టమవుతున్నది. గతంలోనే కాళేశ్వరం ప్రాజెక్టులో విద్యుత్ వినియోగంపై విద్యుత్ రంగ నిపుణుడు, ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి వివరణలు ఇచ్చారు. 'నిజం ఇంటి గడప దాటే లోగా అబద్ధం ఊరిని చుట్టి వస్తుంది' అన్న చందంగా కాళేశ్వరం విద్యుత్ వినియోగంపై అబద్ధపు ప్రచారాలు కొనసాగుతూనే ఉన్నయ్.

విద్యుత్తు వినియోగంపై ఇవీ వాస్తవాలు..

కాళేశ్వరం ప్రాజెక్టులో అవరమయ్యే మొత్తం విద్యుత్తు వినియోగంపై గతంలో కొంత మంది తమ ఊహాగానాల లెక్కలతో ఎకరానికయ్యే విద్యుత్ వ్యయాన్ని లక్ష నుంచి లక్షా యాభై వేలుగా తప్పుడు లెక్కగట్టారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ కింద ఆయకట్టు రైతులు చేసేది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యవసాయమని అన్యాయమైన వ్యాఖ్య చేసేశారు. వాస్తవమేమంటే ప్రాజెక్టు మొత్తం వినియోగం 13,558 మిలియన్ యూనిట్లుగా అంచనా వేశారు. అందులో 75శాతం అంటే 10,168.50 మిలియన్ యూనిట్లు మాత్రమే వాస్తవ వినియోగం. ఇప్పుడు ప్రపంచంలో తయారవుతున్న పంపులు 89–91శాతం ఎఫిషియన్సీ కలిగినవి. వాటి పవర్ ఫ్యాక్టర్ 0.95గా ఉంటుంది. కాబట్టి 10శాతం వరకు ప్రత్యక్షంగా విద్యుత్ వినియోగంలో సేవింగ్స్ ఉంటాయని విద్యుత్ రంగ నిపుణులు చెప్పేమాట. లింక్–1లో టీఎంసీ నీటిని ఎత్తిపోయడానికయ్యే కరెంటు ఖర్చు (ఫిక్స్‌డ్ చార్జీలు కలుపుకొని రూ.570.56 లక్షలు, ఎల్లంపల్లి – మిడ్ మానేరు లింక్–2లో రూ. 1207.43 లక్షలు, మిడ్ మానేరు – మల్లన్నసాగర్ లింక్- 4లో రూ. 1558.23 లక్షలు, మల్లన్నసాగర్ – కొండపోచమ్మసాగర్ లింక్‌లో రూ. 451.91లక్షలు, మొత్తంగా పై లింకులన్నీ కలిపితే మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు ఎత్తిపోతల ద్వారా ఎకరానికయ్యే ఖర్చు రూ. 37,881.55 మాత్రమే. ఈ ఖర్చు కూడా నాలుగు లింకుల్లో అన్ని పంపులు నిరంతరాయంగా 5 నెలల పాటు నడిచినప్పుడు మాత్రమే. కానీ, ఈ పరిస్థితి కాళేశ్వరం ప్రాజెక్టులో ఎప్పుడూ ఉండబోదు. విద్యుత్ నిపుణులు చెబుతున్న దాని ప్రకారం వాస్తవ వినియోగం 50శాతం మాత్రమే. కాళేశ్వరం ప్రాజెక్టులో ఉన్న 22 పంప్‌హౌసుల్లో వివిధ రేటింగ్ (139, 135, 125, 106, 44, 40 మెగావాట్లు) కలిగిన మొత్తం 85 పంపులుంటాయి. అవన్నీ ఒకేసారి నడిచినప్పుడు 4600 మెగావాట్ల కరెంటు అవసరమవుతుందని అంచనా. వాస్తవ వినియోగం 80శాతం అనుకుంటే 3680 మెగావాట్లు. అయితే అన్ని పంపులు ఒకేసారి నడిచే సందర్భం అసలు ఏర్పడకపోవచ్చు. శ్రీరాంసాగర్‌కు వరద వస్తే గ్రావిటీ ద్వారానే మిడ్‌మానేరు, లోయర్ మానేరు, ఎల్లంపల్లి నిండుతాయి. అప్పుడు లింక్ 1,2 లో పంపులు నడిపే అవసరం రాదు. మిడ్‌మానేరు నుంచే పంపులు నడుస్తాయి. శ్రీరాంసాగర్ వద్ద నీరు లేకున్నా ఎల్లంపల్లికి శ్రీరాంసాగర్–ఎల్లంపల్లి మధ్యన ఉన్న పరీవాహక ప్రాంతం నుంచి, కడెం ప్రాజెక్టు నుంచి వరద రావచ్చు. అప్పుడు లింక్–1లో పంపులు నడపరు. లింక్–2లో పంపుల ద్వారా మిడ్‌మానేరుకు, అక్కడి నుంచి కొండపోచమ్మసాగర్ వరకు, శ్రీరాంసాగర్‌కు నీటికి ఎత్తిపోస్తారు. ఆ రెండు చోట్లలో నీరు లేనప్పుడే మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోస్తారు. కాబట్టి కాళేశ్వరం ఎత్తిపోతల కరెంటు ఖర్చులు ఎకరానికి 1– 1.50 లక్షలు ఉంటుందని ప్రాజెక్టు వ్యతిరేకులు చేసే విమర్శలు నిరాధారం.

'ప్రాణహిత – చేవెళ్ల'కూ అదే వినియోగం

తెలంగాణలో ఎత్తిపోతలు లేకుండా రైతులకు సాగు నీరివ్వలేం. ఈ సంగతి వెదిరె సహా ఈ రాష్ట్రంలో అందరికీ తెలుసు. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టులో కూడా దాదాపు ఇంతే కరెంటు వినియోగముంటుంది. ఆ ప్రాజెక్టుపై లేని అభ్యంతరాలు కాళేశ్వరంపై ఎందుకు? ఎత్తిపోతల పథకాల్లో పంపులు నడిస్తే కరెంటు కాలుతుంది. రాష్ట్రంలో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, నాగార్జునసాగర్ దిగువ కాలువ, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, తుమ్మిళ్ల, భక్త రామదాసు, అలీసాగర్, గుత్ప, చౌటుపల్లి హనుమంతరెడ్డి, గూడెం, ఎల్లంపల్లి, దేవాదుల పథకాలు విజయవంతంగా రైతులకు సేవలందిస్తున్నాయి. 2019 నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు నీరందుతున్నది. ప్రస్తుత ప్రభుత్వం నిధులు కేటాయించగలిగితే మరో రెండు మూడేండ్లలో పాలమూరు రంగారెడ్డి, సీతారామ, డిండి, చిన్న కాళేశ్వరం, వార్ధా, చనాక కొరట, సంగమేశ్వర, బసవేశ్వర, చెన్నూరు ఎత్తిపోతల పథకాలు సాగు నీరందించేందుకు సిద్ధమవుతాయి. వాటన్నింటికీ సుమారు 9–10 వేల మెగావాట్ల కరెంటు అవసరమని ఇంజినీర్ల అంచనా. వాటికి ఏటా 10–15 వేల కోట్ల కరెంటు బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఏ ప్రభుత్వానికైనా తప్పదు. తెలంగాణలో ఎత్తిపోతలు అనివార్యమైనప్పుడు కరెంటు ఖర్చులు తప్పవు కదా?. ఖర్చులు – ప్రయోజనాలు అన్న దృష్టి కోణంలో విశ్లేషిస్తూ కూర్చుంటే తెలంగాణ కూడా విదర్భలా రైతు ఆత్మహత్యలకు నిలయంగా మిగిలిపోయి ఉండేది. ఉమ్మడి రాష్ట్ర పాలకులు మీరు ఎత్తు గడ్డ మీద ఉన్నారు, మీకు నీళ్లు రావు' అని దశాబ్దాల పాటు మన నీటిని తరలించుకుపోయారు. ఇప్పుడు కరెంటు ఖర్చుల బూచిని చూపిస్తూ వ్యవసాయ ఆర్థికవేత్తలు, ఇతర అంతర్జాతీయ నిపుణులు ఎత్తిపోతలు తెల్ల ఏనుగులని వర్ణిస్తున్నారు. వారికి వీరికి తేడా లేదు. కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ సోయితో సాహసించి కాళేశ్వరం నిర్మించింది. పాలమూరు–రంగారెడ్డి, డిండి, సీతారామ ఎత్తిపోతలను చేపట్టింది. పెండింగ్ ఎత్తిపోతలను వినియోగంలోకి తెచ్చింది. కరువు, వలసలు, రైతు ఆత్మహత్యలకు చెక్ పెట్టగలిగింది. కాళేశ్వం ప్రాజెక్టు తెలంగాణ కరువుపై జలాస్త్రంలా నిలిచింది.

బహుళ ప్రయోజనాలున్నాయి..

మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు నదీ మార్గాన్ని ఎంచుకోవడాన్ని కూడా వెదిరె తప్పుపడుతున్నారు. కరెంటు ఖర్చు ఎక్కువ అంటున్నారు. నది నుంచి లంబకోణంలో లోతట్టు ప్రాంతాలకు ఎత్తిపోసుకుంటే కరెంటు తక్కువ అవసరం పడేదంటున్నారు. లోతట్టు ప్రాంతాలకు ఎత్తిపోసుకోవడం ఏమిటో అర్థం కాలేదు. మొదట మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్ మానేరుకే నీటిని ఎత్తిపోసుకునే ఆలోచన చేశారు. ఆ మార్గమంతా సింగరేణి బొగ్గు గనులు, రామగుండం పారిశ్రామిక ప్రాంతాలు ఉండడంతో అది వాంఛనీయం కాదని విశ్రాంత ఇంజినీర్ల సంఘమే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అప్పుడు నదీ మార్గాన్నే ఎంచుకోవడం బహుళ ప్రయోజనాల రీత్యా ఉత్తమమైన ప్రత్యామ్నాయమని భావించారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు సుమారు 170 కిలోమీటర్ల పొడవునా గోదావరి సజీవమై ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు అనూహ్యంగా పెరిగాయి. పర్యావరణం, జీవావరణం ఇంతకు ముందెన్నడూ లేనంతగా మెరుగుపడ్డాయి. దేశీయ జల రవాణాకు మార్గం ఏర్పడింది. ఎకో, టెంపుల్ టూరిజానికి అవకాశాలు మెరుగయ్యాయి. అతి తక్కువ ముంపుతో 34టీఎంసీల నీటిని నదిలోనే నిల్వ ఉంచే వీలు కలిగింది.

వరదాయిని కాళేశ్వరం

ఆంధ్రజ్యోతిలో వెదిరె శ్రీరాం రాసిన కాళేశ్వరంపై వ్యాసాలకు వీ ప్రకాశ్ కౌంటర్

నీటిహక్కుల స్థిరీకరణ కోసమే..

ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో మూడో టీఎంసీ పనులు చేపట్టడంపై అందరికీ ఉన్నట్టే వెదిరెకు కూడా అపోహలున్నాయని తెలుస్తున్నది. కేసీఆర్ ఈ పనులు చేపట్టడంలో చాలా ముందు చూపు ఉన్నదన్న సంగతిని మేధావులు కూడా అర్థం చేసుకోలేకపోతున్నారు. అసలు విషయమేమంటే 87 బిలియన్ డాలర్ల వ్యయంతో దేశంలోని 60నదులను ఇతర నదులతో అనుసంధానం చేయాలని 2017లో ప్రధాని మోదీ ప్రణాళిక సిద్ధం చేశారు. ఉత్తరాది నదులైన కెన్–బెత్వా నదుల అనుసంధానం పనులను కూడా మోదీ ప్రభుత్వం ప్రారంభించింది. గోదావరి నీళ్లను కృష్ణా, పెన్నా బేసిన్‌ల ద్వారా కావేరి బేసిన్‌కు తరలించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ అంశాన్ని కేసీఆర్ సీరియస్‌గా తీసుకున్నారు. ఒకసారి గోదావరి–కావేరి అనుసంధాన పనులు మొదలైతే తెలంగాణ తన వాటాను సంపూర్ణంగా వినియోగించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. హైడ్రాలజీ క్లియరెన్స్‌లు పొందడం కష్టమవుతుంది. మన వాటా జలాల వినియోగానికి అవసరమైన ప్రాజెక్టులు నిర్మించకముందే పెన్నా–కావేరి బేసిన్‌లో గోదావరి జలాల వినియోగం ప్రారంభమైతే వారికి ముందుగా రైపేరియన్ రైట్స్ (నదీతీర హక్కులు) ఈ నీటిపై లభిస్తాయి. ఈ పరిస్థితి రాకముందే మూడో టీఎంసీ నీటిని ఎత్తిపోయడం కాళేశ్వరంలో మొదలైతే మన వాటా జలాలపై ముందుగా రైపేరియన్ రైట్స్ తెలంగాణకు దక్కుతాయి. ఈ కారణంతోనే కేసీఆర్ మూడో టీఎంసీ కోసం పదేళ్లుగా తన ప్రణాళికను అమలు చేశారు. వ్యాప్కోస్ ఇచ్చిన మేడిగడ్డ ఇతర బరాజ్‌ల నివేదికల్లోనే మూడో టీఎంసీ కోసం సివిల్ వర్క్స్, ఇతర పనుల ప్రస్తావన ఉన్నది. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌లో కూడా మూడో టీఎంసీ గురించి ప్రస్తావించారు. ఇది ఆకస్మాత్తుగా 2020లో వచ్చిన ఆలోచన కాదు. 2016 ఆగస్టులో ఏజెన్సీలతో ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్‌లో కూడా మూడో టీఎంసీ సివిల్ వర్క్స్, పంపుల గురించి ఉన్నది. మూడో టీఎంసీ ఎందుకు అవసరమో మరో కారణం కూడా ఉన్నది. 2015 తర్వాత మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఫడ్నవీస్ వేన్‌గంగా, వార్ధా జలాలను తమ రాష్ట్రంలోని కరువు ప్రాంతాలకు (విదర్భ)కు మళ్లించే ఆలోచన చేశారు. అవి కార్యరూపం దాల్చితే ప్రాణహితలో వరద తగ్గుతుంది. వానకాలంలో భారీగా వరదనీరు వచ్చే సందర్భంలోనే రోజుకు మూడు టీఎంసీలు ఎత్తిపోసుకోవాల్సి ఉంటుంది. ఆ నీటిని మల్లన్నసాగర్, ఇతర రిజర్వాయర్లలో నింపుకొని కాళేశ్వరం ద్వారా పూర్తిస్థాయి కొత్త, స్థిరీకరించే ఆయకట్టు సుమారు 40లక్షల ఎకరాలకుపైగా నీరందించే అవకాశముంటుంది. గోదావరి బేసిన్లో తెలంగాణ వాటా 968 టీఎంసీలని ఓ వైపు ఏపీ అంగీకరించలేదు. మరోవైపు తన వాటా 775 టీఎంసీలని పేర్కొంటున్నది. గోదావరి జలాల్లో వాటాలు తేల్చేందుకు ట్రిబ్యునల్ వేయాలని ఇప్పటికే ఏపీ డిమాండ్ చేస్తున్నది. ఇది ఎప్పటికైనా ఏర్పడే అవకాశముందన్న సంగతి కేసీఆర్ గ్రహించారు. గోదావరి జలాల్లో ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించిన 968 టీఎంసీల నికరజలాలపై, గోదావరిలో వానకాలం లభ్యమయ్యే అపారమైన వరద జలాలపై తెలంగాణ హక్కులను ట్రిబ్యునల్ ఏర్పడక ముందే స్థిరపరిచే దిశగా ముందు చూపుతోనే మూడో టీఎంసీ పనులు చేపట్టాలని నిర్ణయించారు. కేసీఆర్ ప్రభుత్వ చొరవతో 968 టీఎంసీల నికర జలాల్లో ఇప్పటికే 933 టీఎంసీలకు కేంద్ర జల సంఘం నుంచి హైడ్రాలజీ క్లియరెన్సులు పొందడం విశేషం. ఈ ముందు చూపునకు కృష్ణా బేసిన్‌లో మనకున్న అనుభవాలే ఆధారం. నాడు బచావత్ ట్రిబ్యునల్ ముందే వినియోగంలో ఉన్న నీటికి రక్షణ కల్పించిన కారణంగా బేసిన్ పేరామీటర్లలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉన్నా పెద్ద వాటా సాధించుకోగలిగింది. బచావత్ ట్రిబ్యునల్ గడువు 2000 మార్చితో ముగిసిపోతుందని అన్ని రాష్ట్రాలకు ముందే తెలుసు కాబట్టి కొత్త ట్రిబ్యునల్ ముందు తమ నీటి హక్కులను స్థిరపరచుకునేందుకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు అధిక ప్రాధాన్యతనిచ్చి, నిధులు కేటాయించి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ కూడా వరద జలాలపై ఆధారపడ్డ రాయలసీమ ప్రాజెక్టులను ఆగమేఘాలమీద పూర్తి చేసింది. తెలంగాణలో ఎత్తిపోతలు ప్రారంభమైనా అవి పెండింగ్ ప్రాజెక్టులుగానే మిగిలిపోయాయి. కృష్ణా ట్రిబ్యునల్ అనుభవాల నుంచే కేసీఆర్ ప్రభుత్వం గోదావరి బేసిన్‌లో నీటి హక్కులను స్థిరపరచుకునే ఆలోచనతో మూడో టీఎంసీ పనులు చేపట్టి సమగ్ర డీపీఆర్‌ను కేంద్ర జలసంఘం ఆమోదానికి పంపింది. రాజకీయ కారణాలతో దానిన పక్కన బెట్టిన సంగతి అందరికీ తెలిసిందే. మూడో టీఎంసీ పనులు వెదిరె లాంటి విశ్లేషకులకు అనవసరమైనవి కనిపిస్తాయి. నా లాంటి వారికి గోదావరిలో నీటి హక్కులు స్థిరపరిచే ముందు చూపు కనిపిస్తుంది.

జాతీయ హోదాపై కేంద్రానిదే తప్పు

2014 తర్వాత జాతీయ ప్రాజెక్టు ఇచ్చే పథకం ఏదీ కేంద్ర ప్రభుత్వంలో లేదని వెదిరె చెబుతున్నారు. ఇదే విషయాన్ని నాటి కేంద్ర జల వనరుల మంత్రి నితిన్ గడ్కరీ కూడా పార్లమెంట్‌లో ప్రకటించిన సంగతిని పత్రికలు రిపోర్ట్ చేశాయి. అయినా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కోర్టు వివాదాల్లో ఉన్నా కర్ణాటక రాష్టానికి చెందిన అప్పర్‌భద్రా ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ హైపవర్ కమిటీ సిఫారసు చేయడం, కేంద్ర క్యాబినెట్ ఆమోదించడం, 2023 కేంద్ర బడ్జెట్‌లో ప్రాజెక్టుకు రూ.5వేల కోట్లు కేటాయించడం, కర్ణాటకలో ఓటమి పాలు కాగానే ఏవో కారణాలు చెప్పి జాతీయ హోదా వెనక్కి తీసుకున్న సంగతి అందరికీ తెలుసు. మరి కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తు చేయలేదని, పెట్టుబడి అనుమతులు పొందలేదని, ప్రాజెక్టుకు జాతీయ హోదా అర్హత లేదని వెదిరె చెబుతున్నారు. సాంకేతికంగా అది నిజమే కావచ్చు. ప్రాజెక్టుకు టీఏసీ అనుమతి లభించిన తర్వాత ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి పెట్టుబడి అనుమతుల కోసం రెండేళ్లు ప్రాజెక్టు ఇంజినీర్లు శ్రమించారు. వారికి ఇచ్చే ఉద్దేశం లేదు కాబట్టి కొర్రీలు రాస్తూ పోయారే తప్ప అనుమతిపై పురోగతి ఏమీ లేదు. ఆ లోపు రాష్ట్ర ప్రభుత్వం సొంత వనరులను సమీకరించుకుంది. పెట్టుబడి అనుమతిని ఇవ్వదలుచుకోని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖది తప్పు కానీ నాకు తెలిసి తెలంగాణ ప్రభుత్వ లోపం ఏమీ లేదు.

ప్రభావాలను అధ్యయనం చేయాలనడం తప్పా?

తన వాటా నీటి హక్కులు స్థిరపడే దాకా తెలంగాణ సహా ఏ రాష్ట్రం కూడా అనుసంధానికి ఒప్పుకోదు. ఈ అంశాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం తరపున గతంలో, ఇప్పుడు కూడా ఎన్‌డబ్ల్యూడీఏకి తెలియజేసినట్లు పత్రికల్లో సమాచారం వస్తూనే ఉన్నది. ఇప్పుడు ప్రధానంగా గోదావరి–కావేరీ అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ–సమ్మక్క బరాజ్‌ల మధ్య ఇచ్చంపల్లి బరాజ్ ప్రతిపాదన వస్తున్నది. ఇచ్చంపల్లి నిర్మాణంతో ఈ రెండింటిపై ఏ రకమైన ప్రభావాలు ఉంటాయన్న సంగతి తేల్చేందుకు అధ్యయనం చేయాలనడం తప్పా? కింద నున్న దేవాదుల, సమ్మక్క, సీతారామ ప్రాజెక్టులకు ఉన్న కేటాయింపులను వినియోగించుకునేందుకు ఆపరేషన్ ప్రొటోకాల్ తయారైందా? అన్న ప్రశ్న తప్పేలా అవుతుంది. ముఖ్యంగా రబీకి నీటిని వదలాలని కేంద్రాన్ని అడుక్కునే పరిస్థితి ఏర్పడుతుందన్న అనుమానాలను నివృత్తి చేయాలా వద్దా? అనుసంధానం ద్వారా తరలించే 147 టీఎంసీల నీటిలో 50 శాతం అంటే 73 టీఎంసీల నీరు తెలంగాణకు కేటాయించే అవకాశముందని వెదిరె చెబుతున్నా, తాజాగా రాష్ట్రాలకు పంపిన డీపీఆర్‌లో తెలంగాణ వాటా 44 టీఎంసీలేనని పేర్కొన్నారని పత్రికల్లో వార్తలొచ్చాయి. టాస్క్‌ఫోర్స్ చైర్మన్‌గా వెదిరె ఈ విషయంపై స్పష్టతనివ్వాలి. నదుల అనుసంధాన ప్రాజెక్టు టాస్క్‌ఫోర్స్ చైర్మన్‌గా కీలక బాధ్యతల్లో ఉన్న వెదిరె, తెలంగాణ బిడ్డగా తన హోదా, పరపతిని ఉపయోగించి గోదావరి బేసిన్‌లో పెండింగ్ డీపీఆర్‌లు అన్నింటికీ త్వరగా క్లియరెన్స్‌లు ఇప్పించాలి. ఇవి ఆయనకు కష్టమైన పనులని నేను భావించడం లేదు.

అమిత్‌షా స్పీచ్ మార్ఫింగ్ కేసులో ఐదుగురు అరెస్ట్

- నిందితులకు బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): కేంద్రమంత్రి అమిత్ షా ప్రసంగం వీడియోను మార్ఫింగ్ చేసిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్టు సైబర్ క్రైమ్స్ డీసీపీ కవిత తెలిపారు. నిందితులు టీపీసీసీ సోషల్ మీడియా యూనిట్ ప్రతినిధులు పెండ్యాల వంశీకృష్ణ, మన్నె సతీశ్, పెట్టం నవీన్, అస్మ తస్లీమా, కోయ గీతను కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం షరుతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిందని వెల్లడించారు. నిందితుల నుంచి 5 సెల్‌ఫోన్లు, ట్యాబ్, 2 ల్యాప్‌టాప్‌లు, 2 సీపీయూలను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెయిల్ పొందిన వెంటనే ఐదుగురు అజ్ఞాతంలోకి వెళ్లారు. అమిత్‌షా స్పీచ్ వీడియో మార్ఫింగ్ కేసులో ఢిల్లీ సైబర్‌క్రైమ్ పోలీసులు స్పిరిట్ అఫ్ తెలంగాణ ట్విట్టర్ ఖాతా నిర్వహిస్తున్న అరుణ్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఇతడు జాతీయ కాంగ్రెస్ సోషల్‌మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడు.

అమిత్ షాపై కేసు నమోదు

హైదరాబాద్, సిటీబ్యూరో, మే 3 (నమస్తే తెలంగాణ): కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 1వ తేదీన పాత బస్తీలో అమిత్ షా రోడ్డు షో నిర్వహించి, అనంతరం సభలో పాల్గొన్నారు. ఈ సభలో అమిత్ షాతో కొందరు చిన్నారులు ఉన్నారని, ఓ చిన్నారి చేతిలో బీజేపీ సింబల్ ఉన్నదని పేర్కొంటూ కాంగ్రెస్ నేత నిరంజన్ ఈసీకి ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో గాడిదగుడ్డు పాలన: కిషన్ రెడ్డి

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి గాడిదగుడ్డు ఇస్తున్నాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. 5 నెలల్లోనే కాంగ్రెస్ అవినీతి మార్కును రేవంత్‌రెడ్డి చూపిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో పెండింగ్ నియామకాలకు అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇచ్చి, 28,942 ఉద్యోగాలు భర్తీ చేసినట్టు కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఎద్దేవాచేశారు.

రోహిత్ వేముల దళిత్ కాదు!

- ఆత్మహత్యకు కారణం కులవివక్ష కాదు
- అసలు కులం బయటపడుతుందన్న భయంతోనే బలవన్మరణం
- నిందితులుగా ఉన్న బీజేపీ నేతలందరికీ క్లీన్‌చిట్
- హైకోర్టుకు రాష్ట్ర పోలీసుల నివేదిక
- పునర్విచారణ జరుపుతామని డీజీపీ ప్రకటన
- మరోసారి హెచ్‌సీయూలో విద్యార్థుల ఆందోళన

జస్టిస్ ఫర్ రోహిత్ ఆందోళనలో పాల్గొని మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ (ఫైల్)

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య కేసు దర్యాప్తును ముగిస్తున్నట్టు తెలంగాణ పోలీసులు పేర్కొన్నారు. రోహిత్ వేముల దళితుడు కాదు అని పేర్కొంటూ పోలీసులు హైకోర్టుకు తమ దర్యాప్తు నివేదికను సమర్పించారు. తన అసలు కులం బయటపడుతుందన్న భయంతోనే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న నాటి సికింద్రాబాద్ ఎంపీ, ప్రస్తుత హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, నాటి బీజేపీ ఎమ్మెల్సీ ఎన్ రామచందర్‌రావు, హైదరాబాద్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ అప్పారావు, నాటి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, పలువురు ఏబీవీపీ నాయకులకు పోలీసులు క్లీన్‌చిట్ ఇచ్చారు. వేముల కుటుంబసభ్యుల కులం సర్టిఫికెట్లు అన్నీ నకిలీవని, ఎటువంటి సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును మూసివేస్తున్నామని పేర్కొన్నారు. దీనిపై కింది కోర్టులో ప్రొటెస్ట్ పిటిషన్ వేసుకోవచ్చని హైకోర్టు వేముల కుటుంబానికి సూచించింది.

పోలీసుల నివేదిక అత్యంత దారుణం అని రోహిత్ వేముల సోదరుడు రాజా వేముల పేర్కొన్నారు. దీనిపై ఎలా స్పందించాలో తెలియడం లేదని వాపోయారు. రోహిత్ వేముల 2016 జనవరి 17న హాస్టల్ గదిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన దేశవ్యాప్తంగా కుల వివక్ష వ్యతిరేక ఆందోళనలకు తెరతీసింది. యూనివర్సిటీల్లో దళితులపై కొనసాగుతున్న వివక్షను నిరసిస్తూ దేశంలోని దాదాపు అన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు ఆందోళనలకు దిగారు.

నివేదికలో స్టేట్‌మెంట్లు మాయం: రాజా వేముల

పోలీసుల నివేదికపై శనివారం హైదరాబాద్ వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని రాజా వేముల చెప్పారు. పోలీసులు 2017 తరువాత కేసు దర్యాప్తును నిలిపివేశారని అన్నారు. తమ కుటుంబపు కుల ధ్రువీకరణపై 15 మంది సాక్షుల నుంచి సేకరించిన వాంగ్మూలాలను జిల్లా కలెక్టర్‌కు ఇచ్చారని తెలిపారు. ఆ వాంగ్మూలాల గురించి పోలీసులు తమ నివేదికలో ఎక్కడా ప్రస్తావించలేదని, అలా ఎందుకు జరిగిందో పోలీసులే చెప్పాలని అన్నారు.

బీజేపీ నేతలకు కాంగ్రెస్ సర్కార్ క్లీన్‌చిట్!

చట్టం ప్రకారం ఒకరి కులాన్ని ధ్రువీకరించాల్సింది జిల్లా కలెక్టర్ తప్ప, పోలీసులు కాదు. కులాన్ని ధ్రువీకరించేందుకు జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ (డీఎల్ఎస్సీ) సాక్ష్యాధారాలను సేకరించి కలెక్టర్‌కు అందజేస్తుంది. దాని ఆధారంగా కలెక్టర్ తన నిర్ణయాన్ని వెలువరిస్తారు. రోహిత్ కులానికి సంబంధించి 15 మంది సాక్షుల నుంచి సేకరించిన వాంగ్మూలాలపై జిల్లా కలెక్టర్ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని హైకోర్టులో వేముల కుటుంబం పక్షాన వాదనలు వినిపించిన న్యాయవాది ఏ సత్యప్రసాద్ చెప్పారు. కలెక్టర్ తన నిర్ణయాన్ని వెల్లడించకముందే వేముల దళితుడు కాదని పోలీసులు నిర్ధారించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఇంత హడావుడిగా నివేదికను సమర్పించాల్సిన అవసరం ఏమొచ్చిందని న్యాయమూర్తి కూడా వ్యాఖ్యానించారని సత్యప్రసాద్ తెలిపారు. పోలీసుల నివేదిక వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నదని అన్నారు. బీజేపీ నేతలు, వైస్ చాన్స్‌లర్ చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యల కారణంగానే రోహిత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అన్న అంశంపై దర్యాప్తు చేయడానికి బదులుగా మృతుడి కులం ఏమిటో తెలుసుకోవడంపై దృష్టి సారించారని చెప్పారు. ఈ కేసులో నిందితులందరూ బీజేపీ నాయకులని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వారందరికీ క్లీన్ చిట్ ఇవ్వడం దురదృష్టకరమని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు.



21. We will enact the Rohith Vemula Act to address discrimination faced by students belonging to the backward and oppressed communities in educational institutions

రోహిత్ వేముల చట్టం తెస్తామని ప్లీనరీ సమావేశంలో చేసిన తీర్మాన పత్రం

దర్యాప్తు అధికారులపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలి: జైభీమారావు

తప్పుడు నివేదికను రూపొందించిన పోలీసులపై ఎస్సీ/ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టంలోని సెక్షన్ 4 కింద కేసు నమోదు చేయాలని మరో న్యాయవాది జైభీమారావు పేర్కొన్నారు. షెడ్యూల్డు కులాలలోని మాల కులానికి చెందిన వ్యక్తినని రోహిత్ తల్లి రాధిక వేముల మొదటి నుంచి చెప్తూనే ఉన్నారని అన్నారు. ఆమె తన బాల్యం నుంచి ఓబీసీలుగా ఉన్న వడ్డెర కులానికి చెందిన వారింట్లో పెరిగారని తెలిపారు. చట్టాన్ని పరిగణించకుండా.. కేవలం కొన్ని ప్రాథమిక నివేదికల ఆధారంగా అధికారులు ఒక అంచనాకు వచ్చారని విమర్శించారు. ఇందుకు దర్యాప్తు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ మద్దతు ఏమైంది?

రోహిత్ ఆత్మహత్య అనంతరం సాగిన 'జస్టిస్ ఫర్ వేముల' ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ మద్దతునిచ్చింది. రెండేండ్ల క్రితం 2022, నవంబర్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రోహిత్ తల్లి రాధికను తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. గత ఏడాది ఫిబ్రవరిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశంలో 'రోహిత్ వేముల చట్టం' తెస్తామని ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారి విద్యా హక్కును పరిరక్షించేందుకు రోహిత్ వేముల చట్టాన్ని తెస్తామని ఆ పార్టీ పేర్కొంది. తీరా ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమే కేసును నీరుగార్చే విధంగా నివేదికను ఇవ్వడంపై విద్యార్థి సంఘాలు విస్మయం వ్యక్తం చేశాయి. ఈ నివేదిక తెలంగాణ పోలీసులకు, ఆరెస్సెస్, ఏబీవీపీకి మధ్యనున్న సంబంధాలను స్పష్టం చేస్తున్నదని అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇనియావన్ భానుమతి ఆరోపించారు. ఆరెస్సెస్ 2015 నుంచి వినిపిస్తున్న కథనానికి పోలీసుల నివేదిక ప్రతిరూపంగా ఉన్నదని అన్నారు.

మళ్లీ దర్యాప్తు : డీజీపీ

రోహిత్ వేముల ఆత్మహత్య కేసుపై మళ్లీ దర్యాప్తు జరుపుతామని రాష్ట్ర డీజీపీ రవిగుప్తా శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేసులో దర్యాప్తు నివేదికను గత ఏడాది చివరలో రూపొందించారని, దాని ఆధారంగానే దర్యాప్తు అధికారి గత నెల 21న కోర్టుకు తుది నివేదికను సమర్పించారని తెలిపారు. అయితే విచారణ జరిగిన తీరుపై రోహిత తల్లితోపాటు మరికొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నందున మరోసారి విచారణ జరుపాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ మేరకు మేజిస్ట్రేట్ నుంచి అనుమతి కోరుతామని వెల్లడించారు.

ఆదుకుంటామన్నారు.. కేసును ఆగం పట్టించారు

రోహిత్ వేముల కేసును కాంగ్రెస్ సర్కార్ మొత్తానికి ఆగం పట్టించిందని విద్యార్థిలోకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. బీజేపీకి అనుకూలంగా వారు చెప్పినట్టే కేసును మూసివేయించిందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. రోహిత్ కుటుంబానికి అండగా నిలుస్తామని కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ స్వయంగా చెప్పాడని, ఇప్పుడు ఆ పార్టీ ప్రభుత్వమే వారికి అన్యాయం చేస్తున్నదని మండిపడుతున్నాయి. దళిత, వెనుకబడిన తరగతుల వారు వివక్షకు గురికాకుండా 'రోహిత్ వేముల' చట్టాన్ని తీసుకొస్తామని ఇటీవల తమ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన కాంగ్రెస్ పార్టీ తీరా అధికారంలోకి వచ్చాక ఈ కేసులో నిందితులుగా ఉన్న బీజేపీ నేతలకు అండగా నిలుస్తున్నదని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

హెచ్‌సీయూలో మరోసారి ఆందోళన

కొండాపూర్, మే 3 : రోహిత్ వేముల ఆత్మహత్యపై పోలీసుల నివేదికను వ్యతిరేకిస్తూ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వర్సిటీలోని వెలివాడ నుంచి ప్రధాన గేట్ వరకు వివిధ సంఘాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన గేట్ ముందు ధర్నాకు దిగారు. రోహిత్ వేముల ఆత్మహత్యకు పాల్పడి ఎనిమిదేండ్లు గడుస్తున్నా ఇప్పటికీ న్యాయం జరగలేదని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. రోహిత్ కుల వివక్ష కారణంగానే ఆత్మహత్యకు పాల్పడ్డాడని 16 మంది సాక్ష్యం చెప్పినా పోలీసులు పట్టించుకోలేదని అన్నారు. రోహిత్ వేములకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగుతుందని విద్యార్థులు స్పష్టం చేశారు.

మహిళా కూలీ చెంప ఛెళ్లుమనిపిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి

మహిళా కూలీకి చెంపదెబ్బ

- తడుతూనే కొట్టిన టీ జీవన్‌రెడ్డి
- విస్తుపోయిన వృద్ధురాలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఆర్మూర్‌టౌన్, మే 3: నిజామాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి టీ జీవన్‌రెడ్డి. ఓ మహిళ చెంప ఛెళ్లుమనిపించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని గోవింద్‌పేట్, చేపూర్, పిప్రి గ్రామాల్లో జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోటుకు వెళ్లి ఓ మహిళా కూలీతో మాట్లాడారు. ఈ క్రమంలో ఆమె వినయ్‌రెడ్డిని ఉద్దేశిస్తూ 'మొన్న ఎన్నికల్లో పువ్వు గుర్తుకు ఓటేసిన' అని చెప్పింది. అప్పటికే ఆమె చెంప తడుతూ ఉన్న జీవన్‌రెడ్డి ఒక్కసారిగా ఛెళ్లుమనిపించారు. దీంతో విస్తుపోయిన ఆ వృద్ధురాలు, క్షణాల్లోనే తేరుకొని తనను తాను సంభాళించుకున్నది. 'నాకు పింఛిన యితే ఇవ్వండి సారు..' అంటూ చేతులు జోడించి ఆమె వేడుకోగా, 'వెళ్లి ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని అడుగు' అంటూ వినయ్‌రెడ్డి విసుగ్గా చెప్పడం వీడియోలో కనిపించింది.

తెలంగాణకు కాంగ్రెస్ ప్రత్యేక మ్యానిఫెస్టో

- ఏపీలో కలిపిన ఐదు మండలాలు వెనక్కి
- కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్రానికి 'పాంచ్ న్యాయ్' పేరిట ప్రత్యేక మ్యానిఫెస్టోను విడుదల చేసింది. గాంధీభవన్‌లో శుక్రవారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ తెలుగులో ముద్రించిన ఎన్నికల ప్రణాళిక 'ఐదు న్యాయాలు–తెలంగాణకు ప్రత్యేక హామీలు'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణలో యువత, రైతులు, మహిళలు, కార్మికులకు న్యాయం జరిగేలా మ్యానిఫెస్టోను రూపొందించినట్టు వివరించారు. తెలంగాణలో 15 ఎంపీ సీట్లు సాధించడం ద్వారా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

రాష్ట్రానికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ..

- హైదరాబాద్ మహానగరానికి ఐటీఐఆర్ ప్రాజెక్టును తీసుకరావడం.
- కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ
- బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ
- హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు
- హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి నుంచి రాపిడ్ రైల్వే వ్యవస్థ
- మైనింగ్ విశ్వవిద్యాలయం
- ఆంధ్రలో విలీనమైన ఏటపాక, గుండాల, పురుషోత్తంపట్నం, కన్నెగూడెం, పిచుకలపాడు తిరిగి విలీనం
- పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహోదా
- హైదరాబాద్‌లో నీతి ఆయోగ్ ప్రాంతీయ కార్యాలయం
- రామగుండం–మణుగూరు మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం
- నాలుగు కొత్త సైనిక్ స్కూళ్లు
- కేంద్రీయ విద్యాలయాలు రెట్టింపు
- నవోదయ విద్యాలయాలు రెట్టింపు
- రాష్ట్రానికి జాతీయ క్రీడా వర్సిటీ
- ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో పరిశోధన
- నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ
- రాష్ట్రానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ)
- తెలంగాణకు ఐఐఎస్ఈఆర్
- సర్పంచ్‌లకు నేరుగా కేంద్రం నిధులు
- ప్రతి ఇంటికీ సౌరశక్తి
- హైదరాబాద్ – బెంగళూరు మధ్య ఐటీ, పారిశ్రామిక కారిడార్
- హైదరాబాద్ – నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్
- హైదరాబాద్ – వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్
- అంతర్జాతీయ ప్రమాణాలతో సాంస్కృతిక, వినోద కేంద్రం
- మేడారం జాతరకు జాతీయ హోదా
- డ్రైపోర్టు ఏర్పాటు
- హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్